క్లుప్తంగా

కలెక్టరేట్‌లో చలివేంద్రం ప్రారంభం




గుంటూరు వెస్ట్: స్థానిక కలెక్టరేట్ ఆవరణలో సోమవారం జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలసి కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు ప్రజలు వస్తారన్నారు. వారికి పరిశుభ్రమైన మంచినీటిని అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రస్తుత వేసవిలో స్వచ్ఛంద సంస్థలు వీలైనంత వరకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. వీలైనంత వరకు ఎండబారిన పడకుండా పనులు చక్కబెట్టుకోవాలని జిల్లా ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటరామిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు చీరల పంపిణీ



పట్నంబజారు: చిన్నారులకు ప్రభుత్వం అందించే ఆహార పదార్థాల్ని నిర్ణీత వేళలకు సక్రమంగా పంపిణీ చేయాలని డెప్యూటీ మేయర్ షేక్ సజీల తెలిపారు. తూర్పు నియోజకవర్గం 7వ డివిజన్ మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో సోమవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు అందజేస్తున్న రాగిజావ, భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డెప్యూటీ మేయర్ సజీల మాట్లాడుతూ విధుల్ని బాధ్యతతో నిర్వర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన చేతిరాతతో మేధస్సుకు పదును



గుంటూరు ఎడ్యుకేషన్: చేతిరాతను మెరుగుపరచుకోవడం ద్వారా మేధస్సుకు పదును పెట్టవచ్చని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహనరావు తెలిపారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో ఉపాధ్యాయులకు చేతిరాతను మెరుగుపరచుకునే క్యాలీగ్రఫీ శిక్షణ తరగతుల్ని సోమవారం ప్రారంభించారు. ఉప్పాల రామమోహనరావు సారథ్యంలోని ఉపాధ్యాయ బృందం శిక్షణ తరగతుల్ని నిర్వహించింది. రామమోహనరావు మాట్లాడుతూ చేతిరాతను అందంగా తీర్చిదిద్దుకోవడం ద్వారా విద్యార్థులకు చదువులో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. చేతిరాతను మెరుగుపరచుకున్న ఉపాధ్యాయులు కూడా తమ నైపుణ్యం ద్వారా విద్యార్థుల్ని తీర్చిదిద్దగలరని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయ బృందం తమ పాఠశాలలోని ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ కల్పించి, తద్వారా విద్యార్థుల చేతిరాతను అందంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్యాలీగ్రఫీ శిక్షకులు రమాదేవి, నాగమణి, నాగలక్ష్మి, శ్రీనివాసరావుతో పాటు పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుంటూరు ఈస్ట్: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఆత్మహత్యాయత్నం చేసి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఫాతిమాపురం 2వ లైనులో నివసించే గురజాల లక్ష్మికి మతిస్థిమితం సరిగా ఉండదు. పైగా కడుపునొప్పితో బాధపడుతోంది. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఒంటిమీద కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. స్థానికులు కేకలు విని మంటలు ఆర్పి నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. పోలీసులు ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఓ ఆగంతకుడు మహిళ మెడలో బంగారు గొలుసు తెంచుకుని పరారైన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీరామ్‌నగర్ 1వ లైనులో నివసించే వి.హరిత సోమవారం తన ఇంటి సమీపంలో నడుచుకుంటూ వెళుతోంది. ఈ సమయంలో ద్విచక్ర వాహనంపై గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలోని మూడున్నర సవర్ల బంగారపు గొలుసు తెంచుకుని పరారయ్యాడు. హరిత ప్రతిఘటించినా ఫలితం లేకుండా పోయింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

వివాహిత అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అమరావతి మండలానికి చెందిన వివాహిత బ్రాడీపేట మెయిన్ రోడ్డులోని ఓ వస్త్రాల షాపులో పని చేస్తోంది. ఈనెల 22న విధులు ముగించుకుని షోరూం నుంచి బయటకు వచ్చి ఇంటికి వెళ్లలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో భర్త సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘మా భవిష్యత్తు నువ్వే జగనన్న’కు విశేష స్పందన

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



మా నమ్మకం నువ్వే మా జగన్ పోస్టర్‌ను చూపుతున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నేతలు

పట్నంబజారు: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, మా భవిష్యత్తు జగనన్నే అని ఘంటాపథంగా చెబుతున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిరి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కోటి గృహాలను దిగ్విజయంగా సందర్శించి వారికి అందుతున్న సంక్షేమాన్ని వివరించినట్లు తెలిపారు. 79 లక్షల కుటుంబాల నుంచి వచ్చిన మిస్డ్‌కాల్స్ ప్రభుత్వంపై ఉన్న నమ్మకాన్ని తెలియపరుస్తున్నాయని పేర్కొన్నారు. ఈనెల 7 నుంచి 29 వరకు కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. ఈ ఐదు రోజుల్లో మరో 60 లక్షల కుటుంబాలను సైతం ఏడు లక్షల మందితో కూడుకున్న గృహ సారథులు, వలంటీర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు కలవనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో మేలు జరగాలంటే జన్మభూమి కమిటీల్ని ఆశ్రయించాల్సిన దుస్థితి ఉండేదని, ఈ ప్రభుత్వంలో నేరుగా ప్రజల వద్దకే పాలన చేరుతోందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 78వేల మందిని కలిశామని, ఈ ఐదు రోజుల వ్యవధిలో మరో 20వేల మందిని గృహ సారథులు కలుస్తారని తెలిపారు. తూర్పు నియోజకవర్గ మహిళ నేత షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, యోగేశ్వరరావు, గురవయ్య, అడకా పద్మావతి, రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, అందుగల సంతోష్, జి.శ్రీనివాస్, బి. ఆదిలత, ఎక్కలూరి మారుతి, మల్లెబోయిన శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

తెలుగు భాష, సంస్కృతుల పరిరక్షణ ప్రభుత్వ కర్తవ్యం



విద్యావంతులు, మేధావులతో వెంకటేశ్వరరెడ్డి, అరవింద్, ప్రత్యూష సుబ్బారావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు భాష, సంస్కృతుల పరిరక్షణ ప్రభుత్వం కర్తవ్యమని ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. రాజీవ్ గాంధీనగర్‌లోని శ్రీ వేంకటేశ్వర పబ్లిక్ స్కూలులో సోమవారం ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక, జన విజ్ఞాన వేదిక, స్టెప్, ప్రగతి నారి శక్తి, అవగాహన సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ‘మానవుడే మహనీయుడు’ అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ సామాజిక విలువలతో కూడిన మానవీయ సమాజం ఏర్పడాలంటే ఆధునిక విద్యాబోధనలో రేపటి తరాన్ని తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, భాషా సంస్కృతుల పరిరక్షణకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అనంతరం ‘గ్లోబలైజేషన్ ప్రభావం, తెలుగు భాష, సంస్కృతుల పరిరక్షణ– ప్రజలు, ప్రభుత్వాల కర్తవ్యం’ తదితర అంశాలపై విద్యావంతులు, మేధావులతో చర్చాగోష్ఠి నిర్వహించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రత్యూష సుబ్బారావు, సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ వ్యవస్థాపకులు డాక్టర్ నూతలపాటి అరవింద్ మాట్లాడుతూ మంచి పాట, సంగీతం, నృత్యం సాహిత్యం, విద్యార్థుల మేధో వికాసానికి ఎంతగానో దోహద పడతాయని చెప్పారు. ఈ సందర్భంగా 100కు పైగా దేశభక్తి, అభ్యుదయ, చైతన్య గీతాల సినీ సంగీత విభావరి, సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చైతన్య వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి తనికెళ్ల పార్థసారథి, పాట్లూరి దేవి, అర్జా గజేంద్రరావు, ఏ.కల్యాణి, ఎస్.శ్రీనివాసరావు, పాఠశాల డైరెక్టర్ బత్తిని మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు
- నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి హెచ్చరిక



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

పట్నంబజారు: ప్రజా సమస్యలపై వచ్చే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి హెచ్చరించారు. జీఎంసీ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి కమిషనర్ ఫిర్యాదులు స్వీకరించారు. తొలుత గత వారంలో వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారం, స్పందన పోర్టల్, ఈఆర్పీ, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందించిన ఫిర్యాదుల్ని పరిష్కరించారు. అధికారులు, సచివాలయాల కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. స్పందనకు వచ్చే ఫిర్యాదులపై ఆయా విభాగాధిపతులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. సమస్యల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం అందించాలని తెలిపారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత తప్పకుండా ఫోటోలు జత చేయాలని ఆదేశించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులంతా వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని కమిషనర్ ఆదేశించారు. స్పందనలో భాగంగా 38 ఫిర్యాదులు అందాయని ఆమె తెలిపారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 14, ఇంజినీరింగ్ విభాగానికి 11, ప్రజారోగ్య విభాగానికి మూడు, రెవెన్యూ విభాగానికి నాలుగు, ఉపా సెల్ విభాగానికి మూడు, అకౌంట్స్ విభాగానికి రెండు, పరిపాలన విభాగానికి ఒక ఫిర్యాదు అందినట్లు వివరించారు. త్వరితగతిన సమస్యల్ని పరిష్కరించి, వాటి వివరాల్ని తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంహెచ్‌ఓ డాక్టర్ భానుప్రకాష్, ఏడీహెచ్ రామారావు, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డెప్యూటీ సిటీప్లానర్లు, ఏసీపీలు, ఈఈలు, యస్‌యస్‌లు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు అండగా ఉంటాం

నగరపాలక సంస్థ కార్మిక కుటుంబాలకు అండగా ఉంటామని, వారికి పరిహారాల్ని త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి చెప్పారు. ప్రజారోగ్య విభాగం 19వ డివిజన్‌లో అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహించే జె. మేరి ఇటీవల మరణించారు. ఆమె కుమారుడు డానియేల్‌కు కమిషనర్ రూ.2లక్షల పరిహార చెక్కును సోమవారం తన చాంబర్‌లో అందజేశారు.

ఎన్‌సీసీ కేడెట్లకు నగదు బహుమతుల ప్రదానం



గుంటూరు ఎడ్యుకేషన్: కృష్ణనగర్‌లోని ఎన్‌సీసీ కార్యాలయంలో సోమవారం గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్ ద్వారా ఎంపికైన ఉత్తమ కేడెట్లకు క్యాడెట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎనిమిది మంది కేడెట్లకు నగదు బహుమతులతో పాటు మరో ఎనిమిదికి స్కాలర్‌షిప్స్ రూపంలో నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం. చంద్రశేఖర్, ఎన్‌సీసీ ఏవో లెఫ్టినెంట్ కల్నల్ ఎల్.బి.మాల్, సుబేదార్ రాజా పాల్గొన్నారు.

‘జనసేన నేతలది తప్పుడు ప్రచారం’

నగరంపాలెం: జీఎంసీ పరిధిలోని 22వ డివిజన్‌లో ఎన్నడూ లేని విధంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక జనసేన నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ 22 డివిజన్ అధ్యక్షుడు గేదెల రమేష్ మండిపడ్డారు. శ్రీనివాసరావుపేటలోని పీహెచ్‌సీ అనుకుని ఉన్న రాఘవయ్య పార్కులో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నిజాలు తెలుసుకోకుండా ప్రజలను తప్పుదోవపట్టించేలా జనసేన నాయకులు మాట్లాడటం సరికాదని హితవు పలికారు. జానీ కాలనీ, వేణుగోపాలపురంలో రూ. 30లక్షలతో నూతన రోడ్లు, రూ.20 లక్షలతో రాఘవయ్య పార్కు అభివృద్ధి, శ్రీనివాసరావుపేట ప్రధాన రహదారిలో రూ.50 లక్షలతో కాల్వల నిర్మాణం జరుగుతున్నట్లు చెప్పారు. డివిజన్‌లో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు. 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ మాట్లాడుతూ ఏపీలో అభివృద్ధి, సంక్షేమం దూసుకెళ్తోందని, ఇందులో గుంటూరు రెండో స్థానంలో ఉందని చెప్పారు. 57 డివిజన్లలోనూ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. జనసేన, టీడీపీ ఏరియాల్లోనూ అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. శ్రీనివాసరావుపేట, ఆర్.అగ్రహారంలో జరిగిన అభివృద్ధిని చూసి మాట్లాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో మిర్చి యార్డు డైరెక్టర్ మార్కండేయులు, మెడికల్ బాబు, ఎర్ర బాషా, జానీ బాషా, మోపిదేవి బుజ్జి, మణికంఠ, ఎల్.ఆర్.కె.రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

బాలానంద కేంద్రాల ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం



ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న రాధాకృష్ణమూర్తి, గురుదత్, రాజేష్, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: బాల, బాలికలకు నైతిక విలువలతో కూడిన విద్యాబోధనతో పాటు వేసవి శిక్షణ శిబిరాల ద్వారా సంప్రదాయ కళలపై ఆసక్తి కలిగించేందుకు కృషి చేస్తున్నట్లు బాలానందం కేంద్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, నడింపల్లి గురుదత్ పేర్కొన్నారు. బ్రాడీపేట రెండో లైనులోని బాలనంద కేంద్రంలో సోమవారం వేసవి కళా శిక్షణ శిబిరం ఆహ్వాన పత్రికలు, కరపత్రాల్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్రలేఖనం, సంగీతం, సంప్రదాయ నృత్యాలు, చిత్ర కళలపై ఆసక్తి కలిగేలా చిన్నారుల్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మే ఒకటో తేదీ నుంచి కృష్ణనగర్ ఒకటో లైనులోని లోటస్ హైస్కూలు, బ్రాడీపేట రెండో లైనులోని బాలానంద కేంద్రంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కూచిపూడి నృత్యం, గాత్ర, సంగీతం, డ్రాయింగ్, చదరంగం, కీబోర్డు క్యాషియో, ఫ్లూట్ తదితర అంశాల్లో మూడో తరగతి నుంచి ఎనిమిదేళ్ల వరకు వయసు, ఆపై పిల్లలకు శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. వేసవి శిక్షణ శిబిరం అనంతరం సాధారణ విద్యా బోధనతో పాటు రెగ్యులర్‌గా సైతం ఆయా కళల్లో తరగతులు నిర్వహిస్తూ ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేయడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నిర్వహించే వివిధ పోటీలకు శిక్షణ అందిస్తామని తెలిపారు. వివరాలకు సమన్వయకర్త మాచిరాజు రాజేష్ (9182685890, 9885529340)ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బండారుపల్లి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

- బైక్, 66 గ్రాముల బంగారం స్వాధీనం
- నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

గుంటూరు రూరల్: ఒంటరిగా వెళుతున్న వ్యక్తులు, అర్ధరాత్రి ఒంటరి ప్రయాణికుల్ని బెదిరించి చోరీలకు పాల్పడిన సంఘటనల్లో నల్లపాడు పోలీసులు నిందితుడిని సోమవారం అరెస్టు చేశారు. అడవి తక్కెళ్ళపాడులోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడుకు చెందిన చిమిటిగంట అరుణకుమారి భర్త వీరాంజనేయులు వారం రోజుల కిందట మిర్చి యార్డు సమీపంలో వై.జంక్షన్ మీదుగా ద్విచక్ర వాహనంపై వస్తుండగా అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు అడ్డగించి బెదిరించి బైక్, బంగారు వస్తువులు అపహరించారని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. జిల్లా ఎస్పీ కె.ఆరీఫ్ హఫీజ్ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టగా తెనాలి మారీసుపేటకు చెందిన తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు మద్యం, జల్సాలకు అలవాటుపడి దారిదోపిడీలు, బైక్‌ల చోరీలకు పాల్పడుతున్నాడనే సమాచారం మేరకు సోమవారం అతడ్ని వై.జంక్షన్ సమీపంలో అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. నిందితుడ్ని విచారించగా నేరాల్ని ఒప్పుకున్నాడని చెప్పారు. అతడి వద్ద నుంచి రూ. 4 లక్షల విలువచేసే 66 గ్రాముల బంగారు ఆభరణాలు, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిపై లాలుపేట, పాత గుంటూరు, సత్తెనపల్లి, నగరంపాలెం, చీరాల, నరసరావుపేట తదితర పోలీస్‌స్టేషన్లలో ఇటువంటివే పలు కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. నిందితుడు గతంలో చేసిన నేరాలకు జైలుకు వెళ్లి వచ్చాడని, విడుదలై వచ్చినా తన ప్రవర్తన మార్చుకోలేదని సీఐ తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు కృషి చేసిన ఎస్‌ఐ అశోక్, పీసీలు సుబ్బారావు, షేక్ జాన్‌సైదా, పోతురాజు, కె.వెంకటనారాయణలను సౌత్‌జోన్ డీఎస్పీ వై జెస్సీ ప్రశాంతి అభినందించారన్నారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ శ్రీనివాసరావు తెలియజేశారు.

శరవేగంగా గుంటూరు సమగ్ర అభివృద్ధి

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడి

కొరిటెపాడు(గుంటూరు): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం అభివృద్ధి పనులకు అగ్రాసనం వేస్తున్నట్లు శాసనమండలి సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి వెల్లడించారు. ఈ క్రమంలో శరవేగంగా గుంటూరు నగరంలో ప్రగతి పనులు జరుగుతున్నట్లు ఆయన ప్రకటించారు. గుంటూరు నగరపాలకసంస్థ పరిధిలోని 49వ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన భారత్‌పేట 8వ లైన్ రోడ్డును ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మేయర్ కావటి మనోహర్ నాయుడు, స్థానిక కార్పొరేటర్ బోడపాటి ఉషారాణి తదితరులతో కలసి సోమవారం అప్పిరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా అభివృద్ధి చేసి గుంటూరు దశ, దిశ మార్చడమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అన్ని డివిజన్లలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. నగరంలో అధ్వానంగా తయారైన రహదారులన్నింటినీ పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ గుంటూరు నగరాభివృద్ధిపై గత ప్రభుత్వం పూర్తిగా అశ్రద్ధ చేసినట్లు చెప్పారు. ఒక్క రోడ్డు కూడా సరిగా లేక అత్యంత దయనీయంగా మారిందన్నారు. అటువంటి దుస్థితి నుంచి దశల వారీగా గుంటూరును ప్రగతి బాట పట్టించిన ఘనత ప్రస్తుత ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. స్థానికుల సహకారం, అధికారుల సమన్వయంతో తన నియోజకవర్గంలో విస్తృతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు ఎమ్మెల్యే గిరి చెప్పారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో తెలుగుదేశం నేతలు చెబుతున్నవన్నీ పచ్చి అబద్ధాలని ధ్వజమెత్తారు. సర్వత్రా జరుగుతున్న అభివృద్ధి పనుల్ని చూసి ఓర్వలేకనే వారు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గత పాలకుల నిర్లక్ష్యానికి గురై గుంటూరు ప్రజల దశాబ్దాల కలగా మిగిలిపోయిన ఏటీ అగ్రహారం, పలకలూరు, కొత్తపేట, రామనామక్షేత్రం రోడ్ల విస్తరణకు తమ హయాంలో మోక్షం కలగడమే అందుకు నిదర్శనమని ఆయన వివరించారు. కార్యక్రమంలో బోడపాటి కిశోర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ కొమ్మాలపాటి మోజెస్, తుమ్మేటి శ్రీను, గనిక ఝాన్సీ, బోడపాటి కిరణ్, ఏటూరి సుధాకర్, విప్పర్ల రాఘవ, ఓలేటి అరవింద్, రవి, మెలికా రమేష్, ఆవులమంద ఆదిశేషులు, రాచకొండ శ్రీనివాసరావు, ఏటుకూరి సునీత పాల్గొన్నారు.

మూల్యాంకనం పకడ్బందీగా జరగాలి : కలెక్టర్



టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: మూల్యాంకనం పకడ్బందీగా జరగాలని కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆదేశించారు. నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. పదో తరగతి జవాబు పత్రాల్ని భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు మూల్యాంకనం చేస్తున్న గదుల్లో గాలి, వెలుతురు ఉండేటట్లు చూడాలని చెప్పారు. వేసవి దృష్ట్యా కూలర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజను ఆదేశించారు. మూల్యాంకన కేంద్రంలో వసతులపై ఉపాధ్యాయులను ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల జిల్లా సహాయ కమిషనర్ వెంకటరెడ్డి, సహాయ క్యాంపు అధికారి కె.సుధాకర్‌రెడ్డి, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసీం పాల్గొన్నారు.

వాల్యుయేషన్ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ కల్పలత

నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి. కల్పలత సోమవారం సందర్శించారు. ఆమెకు వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వై. థామస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్. ప్రేమ్‌సాగర్ స్వాగతం పలికారు. వాల్యుయేషన్ కేంద్రంలో ఏర్పాట్లపై ఆమె ఉపాధ్యాయుల్ని ఆరా తీశారు. ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని డీఈవో పి.శైలజకు సూచించారు. మూల్యాంకన విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ పెంచేందుకు కృషి చేసినందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో డెమోక్రటిక్ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు జువ్వా జ్ఞానేశ్వరరావు, ఉపాధ్యాయులు నర్రా చంద్రం, సిరిబోయిన శివశంకర్, వెంకట్రావు, రామసుబ్బయ్య, వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సినీ పాటల పోటీలు



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సినీ పాటల పోటీలు ఉత్సాహంగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి 65 మంది గాయకులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా యల్లాప్రగడ వెంకట సుబ్బారావు, మద్దు వెంకటస్వామి, టి. సుధీర్, వై. హేమామాలిని వ్యవహరించారు. అనంతరం నరసరావుపేటకు చెందిన పి. రవికుమార్‌కు ప్రథమ బహుమతి రూ.7 వేలు, చిలుకలూరిపేటకు చెందిన జి. రాజకుమారికి రెండో బహుమతి రూ. 5 వేలు, నాదెండ్లకు చెందిన చెవుల వెంకటేశ్వర్లుకు మూడో బహుమతి రూ. 3 వేలు అందించారు. ప్రత్యేక బహుమతులు బి. పావని రూ. 2 వేలు, యన్. శ్రీనివాసరావు రూ. 1500, ఆర్. పద్మశ్రీ రూ. 1000, కన్సలేషన్ బహుమతులుగా ఐదుగురికి రూ. 500తో పాటు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో కాపునాడు జిల్లా అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్, గుంటూరు తూర్పు అధ్యక్షుడు బండి రామప్రభు, కళావేదిక సభ్యులు మిరియాల మురళి, మేకల రవీంద్రబాబు, యర్రగోపు నాగేశ్వరరావు, గాదె రత్నారెడ్డి, మేకల పురుషోత్తమ్ ప్రసాద్, చెరుకూరి సాంబశివరావు, పోలూరి వెంకటేశ్వరరెడ్డి, ఇక్కుర్తి రాజారావు, యం.వి. రమణమూర్తి పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్‌కు సన్మానం



గుంటూరు మెడికల్: ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ షేక్ నాగూర్ షరీఫ్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. గుంటూరులోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సన్మానంలో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల్ని రాష్ట్ర కార్యవర్గం దృష్టికి సకాలంలో పరిష్కరించేందుకు నాగూర్ షరీఫ్ చొరవ చూపించాలని కోరారు. జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్ మాట్లాడుతూ గత కార్యవర్గ సమావేశం నుంచి ఇప్పటి వరకు జరిగిన విశేషాల్ని వివరించారు. జిల్లాలో నూతనంగా ఎన్నికైన 20 తాలూకా యూనిట్ల నేతల్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షేక్ నాగూర్ షరీఫ్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 20 తాలూకాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను రాయితీకి ఆరు రోజులే గడువు: మేయర్

పట్నంబజారు: ఆస్తి పన్ను చెల్లింపుల్లో ఐదు శాతం రాయితీ పొందడానికి మరో ఆరు రోజులే గడువు ఉందని, పన్ను బకాయిదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు కోరారు. పోలిశెట్టి సోమసుందరం గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సంస్థల ముందస్తు ఆస్తి పన్ను చెక్కులను నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం మేయర్ చాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో 1,92,809 అసెస్‌మెంట్లు ఉన్నాయన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే ముందస్తు పన్నును పట్టణ ప్రజలు రూ.26.27 కోట్లు చెల్లించారన్నారు. వారికి జీఎంసీ తరఫున ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. పోలిశెట్టి సోమసుందరం గ్రూప్ ఆఫ్ కంపెనీ రూ. 69,86,132 లక్షల ఆస్తి పన్నుకు గానూ ముందస్తుగా చెల్లించి ఐదు శాతం లెక్కన రూ.3,49,306 రాయితీ పొందినట్లు తెలిపారు.